క్లుప్తంగా

భార్యను హతమార్చబోయిన భర్త పై కేసు

లక్ష్మీపురం: మద్యానికి బానిస అయిన భర్త నిత్యం భార్యను కొడుతూ గొంతు కొయబోయిన ఘటన పై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీనగర్ ప్రాంతానికి చెందిన గొడుగు పద్మ టైలరింగ్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటుంది. 25 సంవత్సరాల క్రితం అదే ప్రాంతానికి చెందిన సర్వేశ్వరరావుతో వివాహమైంది. భర్త డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. వీరికి ఇద్దరు ఆడ సంతానం ఉన్నారు. అయితే గత కొంత కాలంగా భర్త సర్వేశ్వరరావు నిత్యం మద్యం సేవించి భార్యను అసభ్యకరంగా తిడుతూ కొడుతూ వేదించడం ప్రారంభించాడు. ఈనెల 7న సర్వేశ్వరరావు పూటుగా మద్యం సేవించి భార్య పై రాళ్ళతో, కర్రలతో దాడి చేసి కత్తితో గొంతు కొయబోయిన ఘటన పై బాధితురాలు స్థానికుల సాయంతో చికిత్స పొందినంతరం మంగళవారం అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు సన్మానం



గుంటూరు మెడికల్: బిజినెస్ బై బ్రాహ్మిణ్ గుంటూరు చాప్టర్ కన్వీనర్, గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశ్వీ రమణ పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం పలువురు గుంటూరు చాప్టర్ నేతలు డాక్టర్ రమణకు శాలువా కప్పి, పూలబొకేలు అందజేసి సన్మానించారు. సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన ఏడాదిలో ఆసుపత్రిలో పలు అభివృద్ధి కార్యక్రమాలు డాక్టర్ రమణ ఆధ్వర్యంలో జరగడం చాలా అభినందనీయమన్నారు. ప్రజా సేవలో నిరంతరం కొనసాగాలని అభిలషించారు. అత్యంత అరుదైన ఆపరేషన్లు పేదలకు చేస్తూ ఎంతో మంది ప్రాణాలు కాపాడుతున్నారని పేర్కొన్నారు. అభినందనలు తెలిపిన వారిలో గుంటూరు చాప్టర్ ప్రెసిడెంట్ కె.శ్రీధర్‌బాబు, సెక్రటరీ డి.హేమంత్, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్, వీరకుమార్, బందా సాయి, సాయిరామ్, చైతన్య, మాధవ్, ఫణికుమార్, కోటేశ్వరరావు, రమాదేవి, రమణ, తదితరులు ఉన్నారు.

వీఐపీ రోడ్డులో గుర్తు తెలియని మృతుడు



లక్ష్మీపురం: గుంటూరు వీఐపీ రోడ్డులోని కృష్ణబాబు కాలనీ గడ్డి వాము వద్ద గుర్తు తెలియని వ్యక్తి (40) మృత దేహాన్ని పోలీసులు గుర్తించారు. నగరంపాలెం పోలసులు తెలిపిన వివరాల ప్రకారం కృష్ణబాబు కాలనీ వద్ద గడ్డి వాము వద్ద ఓ వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు వచ్చిన సమాచారం మేరకు నగరంపాలెం పోలీసులు ఘటనా ప్రదేశంలో విచారించగా ఎలాంటి ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో మృత దేహాన్ని గుంటూరు ప్రభుత్వ సమగ్రాసుపత్రిలోని మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిసిన వారు నగరంపాలెం సీఐ 8688831336, ఎస్సై 8688831340లో సంప్రదించాలన్నారు.

వెన్నుముకే మనకు వెన్నుదన్ను

- ఆధునిక జీవన శైలితో పెరుగుతున్న 'వెన్ను' సమస్యలు
- అందుబాటులో ఆధునిక వైద్యసేవలు
- రేపు వరల్డ్ స్పయిన్ డే



గుంటూరు మెడికల్: ఆధునిక జీవన శైలి వల్ల చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరిలో వెన్నుముక సమస్యలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. పాఠశాల విద్యార్థులు అధిక బరువు బ్యాగులను మోయడం వల్ల, కళాశాల యువత తరగది గదుల్లో ఎక్కువ సేపు కూర్చోలేక వెన్నుముక సమస్యతో వైద్యులను సంప్రదిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 540 మిలియన్ల మంది ప్రజలు ఏదో ఒక మోతాదు వెన్నునొప్పితో బాధపడుతున్నారు. వెన్ను సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి మెరుగైన వైద్యం అందించడం ద్వారా నయం చేయవచ్చు. ప్రజలకు స్పయిన్ సమస్యలపై అవగాహన కల్పించి ప్రజలు వెన్నుముక సమస్యల బారిన పడకుండా ఉండేందుకు ప్రతి ఏడాది అక్టోబరు 16న వరల్డ్ స్పయిన్ డే నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

వెన్ను సమస్యలకు కారణాలు...

ప్రతి మనిషి తన జీవిత కాలంలో ఏదో ఒకరోజు వెన్నునొప్పితో బాధపడటం జరుగుతుంది. ఎక్కువ సేపు కంప్యూటర్‌ల ముందు కూర్చుని పనిచేయటం, స్మార్ట్‌ఫోన్‌లు వినియోగిస్తూ ఎక్కువసేపు ఒకేచోట కూర్చుండిపోవటం, ఊబకాయం, శారీరక శ్రమ లేకపోవటం, జీవనశైలిలో మార్పులు, ధూమపానం, కార్లు, ద్విచక్రవాహనాలపై ఎక్కువ దూరాలు ప్రయాణాలు చేయటం, గుంటలు ఉన్న రోడ్లపై వాహనాలు నడపటం, ఒత్తిడితో కూడిన జీవితాన్ని గడిపేవారిలో వెన్నుముక సమస్యలు వస్తున్నాయి.

జిల్లాలో బాధితులు...

గుంటూరు జీజీహెచ్‌లో ప్రతిరోజూ 30 మంది వెన్నుముక సంబంధిత సమస్యలతో ఆర్థోపెడిక్ వైద్యులను సంప్రదిస్తున్నారు. జిల్లాలో 15 మంది స్పెయిన్ సర్జన్స్, 15 మంది న్యూరోసర్జన్స్ ఉన్నారు. ప్రతిరోజూ ఒక్కో వైద్యుడి వద్దకు 10 మంది వరకు వెన్నుముక సమస్యలతో చికిత్స కోసం సంప్రదిస్తున్నారు.

సహజ అరుగుదల ఉంటుంది

సాధారణంగా వయస్సు పెరిగే కొద్ది వెన్నుపూస మధ్యలో ఉండే డిస్కులు అరిగి గ్యాప్ ఏర్పడుతోంది. గ్యాప్ ఏర్పడిన సమయంలో కొత్తగా కండరం పెరగడం, లేదా ఎముక పెరగడం జరిగి నడుము నొప్పి, తుంటి నొప్పి, కాలుజాలు, కాలు తిమ్మిరి, కాలు పటుత్వం తగ్గిపోవడం, మల, మూత్రాలను ఆపుకోలేక నియంత్రణ కోల్పోవడం జరుగుతోంది. డిస్క్ జారినప్పుడు గజ్జల్లో నొప్పి, తొంటి నొప్పి వస్తుంది. కాళ్ళల్లో స్పర్శ తగ్గిపోతోంది. వెన్నుపూస ఆకారం మారిపోతోంది.

90 శాతం అవే తగ్గిపోతాయి

వెన్నుముకలో డిస్క్ సమస్యలు వచ్చిన మొదటిసారి నూటికి 90 శాతం అవే తగ్గిపోతాయి. తొలిసారి డిస్క్ సమస్య వచ్చినప్పుడు విశ్రాంతి తీసుకోవాలి. 48 గంటలపాటు నడుముకు విశ్రాంతి ఇస్తే నొప్పి తగ్గుతోంది. వేడినీళ్ళు కాపడం, ఫిజియోథెరఫీ, నొప్పి నివారణ మాత్రలు కొద్దిపాటి వ్యాయామం ద్వారా మూడు వారాల్లో నొప్పి తగ్గిపోతుంది. రెండో సారి సమస్య వస్తే 50శాతం ఎలాంటి వైద్యం చేయకుండానే తగ్గిపోతాయి. మొండిగా సమస్య ఉన్నవారికి తుంటికి ఇంజక్షన్ ఇవ్వడం ద్వారా మూడు వారాల్లో నొప్పి తగ్గిపోతుంది. మూడోసారి మరలా డిస్క్ సమస్య వస్తే 20 శాతం మాత్రమే వాటంతట అవి తగ్గుతాయి. వీటికి తప్పనిసరిగా వైద్యం చేయాల్సి ఉంటుంది. కీ హోల్ సర్జరీ ద్వారా ఎముక, కండ కట్ చేయకుండా చిన్న రంధ్రం ద్వారా జరిగిన ఎముకను సరిచేసి నొప్పిని నివారించవచ్చు.

ఇవన్నీ అపోహలే ....

వెన్నుముక సర్జరీలు సురక్షితం కాదనే అపోహ ప్రజల్లో ఉంది. సర్జరీ చేసే సమయంలో నరాలు దెబ్బతింటే జీవితాంతం నడక ఉండదని భావిస్తారు. ఒకసారి సర్జరీ చేస్తే మరలా మరలా సర్జరీ చేయాల్సి వస్తుందనే అపోహ ప్రజల్లో ఉంది. సర్జరీ చేయించుకున్నవారు వంగకూడదు, బరువు ఎత్తకూడదు, జీవితాంతం జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు భావిస్తారు. ఇవన్ని కేవలం అపోహలు మాత్రమే.

అందుబాటులో ఆధునిక చికిత్సలు



వెన్నుముక శస్త్రచికిత్సల్లో అత్యాధునిక వైద్య పద్ధతులు నేడు అందుబాటులో ఉన్నాయి. రోబోటిక్స్, కంప్యూటర్ న్యావిగేషన్, న్యూరోమానిటరింగ్, ఎండోస్కోప్, కీహోల్ ఆపరేషన్లతో వెన్నముక సమస్యలను చాలా సులువుగా నయం చేస్తున్నారు. వ్యాధి నిర్ధారణలో స్టాండింగ్ ఎమ్మారై వంటి ఆధునిక వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. ప్రతిరోజూ వ్యాయామం చేయటం, బరువు నియంత్రణలో పెట్టుకోవటం, కూర్చుని పనిచేసే వారు ప్రతిరెండు గంటలకు ఒకసారి లేచి నడవటం, ఎక్కువ సేపు ఒంగి పనులు చేయకుండా ఉండటం, అధిక బరువులు ఎత్తకుండా ఉండటం ద్వారా వెన్ను సమస్యలు దరిచేరవు.

– డాక్టర్ జి.నరేష్‌బాబు, సీనియర్ స్పయిన్‌సర్జన్, గుంటూరు.

నిషాధ రాజ్యానికి రాజు నలుడు


మాట్లాడుతున్న వేంకట శ్రీరంగనాయకి

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం పద్మావతి కళ్యాణ వేదికపై ప్రబంధ సాహిత్యం – ఆధ్యాత్మికం ప్రవచనాల్లో భాగంగా మంగళవారం నలోపాఖ్యానంలోని హంస–నలుని వృత్తాంతంపై ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. తొలుత ఆలయ కమిటీ అధ్యక్షులు సి.హెచ్.మస్తానయ్య, ఉపాధ్యక్షులు లంకా విజయ బాబు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. డాక్టర్ కోగంటి వేంకట శ్రీరంగనాయకి ప్రసంగిస్తూ నలుడు నిషాధ రాజ్యానికి రాజని అన్నారు. ఆయన దమయంతి అనే విదర్భ యువరాణిని వివాహం చేసుకున్నాడని పేర్కొన్నారు. ఒకరోజు నలుడు తన తోటలో విహరిస్తుండగా, ఆయన ఒక అందమైన హంసను పట్టుకున్నాడని తెలిపారు. ఆ హంస మానవ భాషలో మాట్లాడిందని అన్నారు. నలుని వద్దకు దమయంతి వద్దకు రాయబారంగా వెళ్లి, ఆమెకు నలుని గురించి చెప్పిందన్నారు. ఆ తర్వాత, దమయంతి స్వయంవరంలో నలుడు, దమయంతిని ఎంచుకున్నాడని హంస–నలుని వృత్తాంతాన్ని విపులంగా వివరించారు.

ఆరోగ్యశ్రీ సేవల నిలుపుదల కానివ్వకండి

అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి విజ్ఞప్తి

లక్ష్మీపురం: సీజనల్ వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో పీహెచ్ సీ వైద్యుల ఆందోళన, ఆరోగ్యశ్రీ సేవల నిలుపుదల వంటి చర్యలతో వైద్య ఆరోగ్య రంగంలో సంక్షోభం నెలకొని ఉన్నదని, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని పరిస్థితులను చక్కదిద్దాలని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి విజ్ఞప్తి చేశారు. గుంటూరు అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎన్.టి.ఆర్ వైద్య సేవల నెట్‌వర్క్ ఆసుపత్రులు శుక్రవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేశాయని, మరోపక్క తమ దీర్ఘకాలిక సమస్యల పరిష్కారాన్ని కోరుతూ పి.హెచ్.సి వైద్యులు ఇప్పటికే ఆందోళన చేస్తున్నారన్నారు. సీజనల్ జ్వరాలు, ఇతర రోగాలు పట్టిపీడిస్తున్న సమయంలో ఇటువంటి పరిస్థితులు తలెత్తడం బాధాకరమన్నారు. ఈ స్థితి ఉత్పన్నం కావటానికి కారణం ప్రభుత్వమే కాబట్టి పరిష్కరించే బాధ్యత ప్రభుత్వానిదేనని అవగాహన సంస్థ విజ్ఞప్తి చేస్తుందన్నారు. త్వరితగతిన ఈ పరిస్థితిని చక్కదిద్దకపోతే అనారోగ్యాంధ్ర ప్రదేశ్‌గా దిగజారవచ్చని ప్రమాద ఘంటికలు మోగక ముందే ప్రభుత్వ పెద్దలు మేలుకోవటం అవసరమన్నారు. బకాయిల పాపం గత ప్రభుత్వానిదేనని తప్పించుకోవడం సబబు కాదని, ప్రస్తుతం అధికారంలో ఎవరంటే వారిదే బాధ్యతని, నెపాలు మోపటం కాకుండా వైద్య సేవలు ఉచితంగా అందించే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

నకిలీ ఆర్డర్ ఇచ్చిన ఉద్యోగిపై సస్పెన్షన్ వేటు

సాక్షి ఎఫెక్ట్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి డబ్బులు వసూలు చేయడంతో పాటు కమిషనర్ సంతకం పోర్జరీ చేసి నకిలీ ఆర్డర్ ఇచ్చిన కార్పొరేషన్ ఉద్యోగిని సస్పెండ్ చేస్తూ కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నగరపాలక సంస్థ సర్కిల్ ఆఫీస్ (బృందావన్‌గార్డెన్స్)లో రికార్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎస్.నాగేశ్వరరావు విజయవాడకు చెందిన జడ సుందరరావు అనే వ్యక్తికి కార్పొరేషన్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి అతని వద్ద నుంచి రూ.4,40,000 వసూలు చేశాడు. అతనికి కమిషనర్ సంతకంతో కూడిన నకిలీ ఆర్డరు కాపీ కూడా ఇచ్చాడు. సదరు ఆర్డరు పట్టుకుని కార్పొరేషన్‌లో తన సీటు కోసం వెతుకున్న క్రమంలో మోసపోయానని తెలుసుకుని కమిషనర్‌కు ఫిర్యాదు చేశాడు. దీనిపై సాక్షి దినపత్రికలో ఈ నెల 9వ తేదీన 'ఉద్యోగం పేరుతో మోసం' అనే శీర్షిక ప్రచురితమైంది. దీంతో పాటు 13వ తేదీ సోమవారం సాక్షిలో 'నకిలీ ఆర్డర్ ఇచ్చినా చర్యలు శూన్యం! పేరిట మరో కథనం ప్రచురితమైంది. దీనిపై డిప్యూటీ కమిషనర్–2 సీహెచ్ శ్రీనివాస్‌ను విచారణ అధికారిగా నియమించి విచారణ చేపట్టాలని ఆదేశించారు. సదరు విచారణలో ఎస్.నాగేశ్వరరావు కమిషనర్ సంతకం ఫోర్జరీ, నగదు తీసుకొని నకిలీ ఉద్యోగ నియామక పత్రం అందించినట్లు నిర్ధారణ జరగడంతో కమిషనర్ శ్రీనివాసులు నాగేశ్వరరావును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

శానిటేషన్ సెక్రటరీ కూడా...

నెహ్రూనగర్: పారిశుద్ధ్య సమస్యలపై 45వ వార్డు సచివాలయం పరిధిలోని ప్రజలు చేసిన ఫిర్యాదు పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు పరిష్కారం చేసినట్లుగా వివరాలు నమోదు చేసిన శానిటేషన్ సెక్రటరీ వై. త్యాగరాజును కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళవారం సస్పెండ్ చేశారు. ప్రజా ఫిర్యాదుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని.. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సైబర్ నేరాలపై సమీక్ష

నగరంపాలెం: తూర్పు సబ్ డివిజన్‌లోని కొత్తపేట పీఎస్‌లో మంగళవారం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తనిఖీలు నిర్వహించారు. అనంతరం పలు అంశాలపై జిల్లా ఎస్పీ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఆర్‌పీఎఫ్, జీఆర్పీ పోలీసుల సమన్వయంతో రైల్వేస్టేషన్, నిర్మానుష్య ప్రదేశాల్లో పటిష్టమైన నిఘా ఉండాలని అన్నారు. డ్రోన్ బీట్స్‌తో అనుమానాస్పద వ్యక్తులను గుర్తించాలని చెప్పారు. రైల్వేస్టేషన్, బస్టాండ్, ఆసుపత్రులు, వ్యాపార సముదాయాల వద్ద మహిళలకు రక్షణ కల్పించే విషయామై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, రౌడీషీటర్లు మళ్లీ నేరాలకు పాల్పడకుండా చర్యలు చేపట్టాలని అన్నారు.

సైబర్ క్రైమ్స్ మోసగాళ్ల వలలో పడకండి

పట్టాభిపురం సీఐ జి. వెంకటేశ్వర్లు


మాట్లాడుతున్న పట్టాభిపురం సీఐ వెంకటేశ్వర్లు

గుంటూరు ఎడ్యుకేషన్: సమాజంలోని పౌరులందనూ సైబర్ క్రైమ్స్ గురించి అవగాహన పొందడంతో పాటు మోసగాళ్ల వలలో పడకుండా అప్రమత్తంగా ఉండాలని పట్టాభిపురం సీఐ జి. వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ విభాగ ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్స్ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీహెచ్ కామేశ్వర శాస్త్రి అధ్యక్షతన జరిగిన సదస్సులో సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సైబర్ క్రైమ్ గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. గుర్తు తెలియని నంబర్ల నుంచి వచ్చే వేర్వేరు మెసేజ్‌లకు, మీరు లాటరీ గెలుచుకున్నారంటూ వివిధ రకాల లింక్స్ పంపినా, తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తామంటూ ఆధార్, రేషన్ కార్డ్, పాన్ కార్డ్ పంపించాలని చెప్పేవారిని సైబర్ నేరగాళ్లుగా గుర్తించి వెంటనే అప్రమత్తం అవ్వాలని సూచించారు. అదే విధంగా డిజిటల్ అరెస్ట్ అంటూ మిమ్మల్ని ఎవరైనా కాల్స్ చేసి బెదిరించినా భయపడకుండా తక్షణమే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. వేగంగా మారుతున్న కాలంలో సైబర్ క్రైమ్స్ సైతం అంతే వేగంగా జరుగుతున్నాయని, దీనిపై తెలివితేటలతో వ్యవహరించాలని సూచించారు. సదస్సులో ఎస్సై రామాంజనేయులు, సిబ్బంది రాజకుమార్, ప్రదీప్, కళాశాల ఎన్‌సీసీ అధికారి మేజర్ పి.కుమార్‌రాజా, ఇంటర్ క్యాంపస్ ఇన్‌చార్జ్ జి.సురేష్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫ్యూచర్ మార్కెట్ మేకర్స్ విజేతలుగా జేకేసీ విద్యార్థులు


విద్యార్థులతో ప్రిన్సిపాల్ గోపీచంద్, ఎస్సార్కే ప్రసాద్ తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాల కామర్స్ విభాగ ఆధ్వర్యంలో మంగళవారం బీకాం, బీబీఏ తృతీయ సంవత్సర విద్యార్థులకు నెక్స్‌జెన్ జనరేషన్ మార్కెట్ మేకర్స్ అనే అంశంపై పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా 400 మంది విద్యార్థులు 12 బృందాలుగా ఏర్పడి వివిధ రకాల ఉత్పత్తులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎకో ఫ్రెండ్లీ, స్మార్ట్ స్లీప్ మాస్క్, ఐప చిప్స్, ఎలక్ట్రిసిటీ జనరేషన్, షెల్టర్ వెహికల్స్, వెండింగ్ మిషన్, బయోకోల్, ఎయిర్ ట్యాక్సీ తదితర ఉత్పత్తులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా తొలి మూడు స్థానాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.గోపీచంద్, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్సార్కే ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కె.సాంబశివరావు, పి.నాగసుశీల, కామర్స్ విభాగాధిపతి ఎం.అప్పారావు, అధ్యాపకులు ఎన్.హరిత, అరుణ కుమారి, కె.చరణ్ చౌదరి, ఎ.వెంకటకృష్ణ, కె.అంజనీదేవి, కె.వేణు, యు.వెంకటేశ్వరరావు, కె. కల్పన, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ శిక్షణతో విద్యార్థులకు జాతీయభావం

ఏపీ,టీజీ ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ నర్సింగ్ సైలానీ


క్యాడెట్లతో నర్సింగ్ సైలానీ

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో జాతీయ భావం పెంపొందించేందుకు ఎన్‌సీసీ శిక్షణ దోహదం చేస్తుందని ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాల ఎన్‌సీసీ డైరెక్టరేట్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమోడోర్ నర్సింగ్ సైలానీ అన్నారు. మంగళవారం కృష్ణనగర్‌లోని 10 ఆంధ్ర గరల్స్ బెటాలియన్ ఎన్‌సీసీ యూనిట్‌ను ఎన్‌సీసీ గ్రూప్ గుంటూరు కల్నల్ సుదాన్షు దుబేతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ శిక్షణ పొందుతున్న కేడెట్లతో మాట్లాడారు. ఎన్‌సీసీ కేడెట్లకు అత్యుత్తమ శిక్షణ అందిండచంలో బెటాలియన్ బెటాలియ్ కృషిని అభినందించారు. జాతీయ స్థాయి శిబిరాల్లో అవార్డు గెలుచుకున్న క్యాడెట్లను సత్కరించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఎన్‌సీసీని మరింత బలోపేతం చేసే విధంగా కృషి చేస్తామని అన్నారు. విద్యార్థుల్లో జాతీయత భావాన్ని, దేశం పట్ల గౌరవాన్ని పెంపొందించే విధంగా తోడ్పాటు అందిస్తుందని, ముఖ్యంగా విద్యార్థుల్లో ఒక బాధ్యతాయుతమైన నడవడికను అలవర్చే విధంగా ఎన్‌సీసీ శిక్షణ అందిస్తుందని తెలిపారు. అనంతరం ప్రభుత్వ మహిళా కళాశాల, ఆర్వీఆర్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల, సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలల నుంచి వచ్చిన గరల్స్ కేడెట్లకు సెరిమోనియల్ గార్డ్ ఆఫ్ ఆనర్‌ను అందజేశారు. కార్యక్రమంలో కమాండింగ్ ఆఫీసర్, లెఫ్టినెంట్ కల్నల్ ఎస్‌వీఎస్ సుదర్శన్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి మేజర్ అవినాషి పటాల్, ఎన్‌సీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ ఉద్యోగుల నిరసన


సమస్యలు పరిష్కరించాలంటూ రసన తెలుపుతున్న బ్యాంకు ఉద్యోగులు

కొరిటిపాడు: దేశంలో ప్రైవేట్ బ్యాంకు ఉద్యోగుల యూనియన్ సెల్ (భారతీయ బ్యాంకు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో) ఇచ్చిన పిలుపు మేరకు గుంటూరు అరండల్ పేటలోని ఫెడరల్ బ్యాంకు వద్ద ప్రైవేటు బ్యాంకు ఉద్యోగులు, ప్రభుత్వరంగ బ్యాంకు ఉద్యోగులు, పెన్షనర్లు కలిసి సుమారు 150 మంది వారి సమస్యలు పరిష్కరించాలంటూ మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సంఘం చైర్మన్ కిషోర్ కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి కే.ఎస్.రావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రైవేట్ బ్యాంకు ఉద్యోగులకు రావలసిన ఆర్థిక సౌకర్యాలను ఇవ్వకుండా, వారి నాయకులను ఉద్యోగం నుంచి తొలగిస్తుందన్నారు. ఉద్యోగులు కష్టపడి సంపాదించిన లాభాలన్నీ ప్రభుత్వం బ్యాంకు రుణాల ఎగవేతదారులకు సర్దుబాటు చేస్తున్నారన్నారు. ఈ సంవత్సరం డిసెంబర్ 10న పార్లమెంటు ఎదుట ధర్నాకు పిలుపునిచినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఫెడరల్ బ్యాంకు నాయకులు సురేష్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించేంత వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సంఘం కార్యదర్శి భాషా, మురళీ, రామకృష్ణ, జిల్లాలోని బ్యాంకు పెన్షనర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మనిషిని కేంద్ర బిందువుగా చేసిన మతం బౌద్ధం

బౌద్ధం ధర్మంపై జరిగిన చర్చలో వక్తలు


నివాళులర్పిస్తున్న సభ్యులు

లక్ష్మీపురం: దేవునికి బదులుగా మనిషిని కేంద్ర బిందువుగా చేసిన మతం బౌద్ధమని, అంధ విశ్వాసాలు, ఆచారాలకు బదులుగా హేతుబద్ధత, నైతికత, శాస్త్రీయ సూత్రాల పై ఆధారపడిన మతం బౌద్ధమని భావించే ఆరోజుల్లో అంబేద్కర్ బౌద్ధమతాన్ని స్వీకరించారని విశ్రాంత ప్రిన్సిపల్ ముప్పాళ్ళ వి.ఎస్.ప్రసాదరావు తెలిపారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బౌద్ధమతాన్ని స్వీకరించిన సందర్భాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బౌద్ధమతం కుల వ్యవస్థను వ్యతిరేకిస్తుందని, ధనవంతులు, పేదలు అందరూ కుల బేధాలు లేకుండా బౌద్ధ సంఘంలో సభ్యులుగా ఉంటారని తెలిపారు. సీనియర్ ఇంజనీర్ ఎన్.సదాశివం, సంస్థ కార్యదర్శి కొండాశివ రామిరెడ్డి మాట్లాడుతూ అసమానతాలకు ప్రతీకగా ఉన్న హిందూ మతాన్ని వీడి స్వేచ్ఛ, సమానత్వం, సోదర భావంతో కూడిన బౌద్ధ ధర్మంలోకి వచ్చానని అంబేద్కర్ ఆనాడే చెప్పారని గుర్తు చేశారు. తన మత మార్పిడి ధనం, అధికారం కోసం కాదు. మానవ గౌరవం స్వాభిమానం కోసం అంటూ అంబేద్కర్ చెప్పిన మాటలు లక్షలాది మందిని ప్రభావితం చేశాయన్నారు. అనంతరం పలువురు సభ్యులు, సీనియర్ సిటిజన్స్ తదితరులు ప్రసంగించారు.

నేడు అన్నపూర్ణ కాంప్లెక్స్ సీజ్

- కోర్టు ఉత్తర్వుల మేరకు...
- వ్యాపారులు స్వచ్ఛందంగా ఖాళీ చేయాలి
- నగర కమిషనర్ పులి శ్రీనివాసులు


మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఉత్తర్వుల మేరకు అనధికార హోల్‌సేల్ కూరగాయల వ్యాపారాలు చేస్తున్న అనుమతి లేని అన్నపూర్ణ కాంప్లెక్స్‌లోని వ్యాపారులు స్వచ్ఛందంగా ఖాళీ చేయాలని, లేని పక్షంలో బుధవారం నగరపాలక సంస్థ అధికారులు సీజ్ చేస్తారని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. అన్నపూర్ణ కాంప్లెక్స్ సీజ్ చేసే అంశంపై మంగళవారం కమిషనర్ చాంబర్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ కొల్లి శారదా హోల్‌సేల్ మార్కెట్‌లో మాత్రమే రైతులు తమ కూరగాయలను విక్రయించుకోవడానికి అనుమతులు ఉన్నాయని, అనుమతులు లేకుండా జాతీయ రహదారి సర్వీస్ రహదారిలో, నిర్దేశిత అనుమతులు లేని అన్నపూర్ణ కాంప్లెక్స్‌లో వ్యాపారాలు చట్టవ్యతిరేకమన్నారు. కొల్లి శారదా మార్కెట్‌లో లీజు గడువు ముగిసిన 81 షాపులకు 3 రోజుల పాటు పారదర్శకంగా బహిరంగ వేలం నిర్వహించి, గతంలో సుమారు రూ.81 లక్షల ఆదాయం వచ్చే షాపులకు రూ.6 కోట్లు ఏడాదికి జీఎంసీకి ఆదాయం వచ్చిందన్నారు. సదరు వేలంలో కొత్తవారితో పాటు అప్పటి వరకు వ్యాపారం చేసుకున్నవారు పాల్గొన్నారని తెలిపారు అన్నపూర్ణ కాంప్లెక్స్ నిర్వాహకులకు ఇప్పటికే చట్ట ప్రకారం నోటీసులు జారీ చేశామని, వారు హైకోర్టులో కేసు దాఖలు చేయగా కోర్టు ఈ నెల 10వ తేదీలోపు కాంప్లెక్స్‌ని ఖాళీ చేయాలని ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. సదరు కాంప్లెక్స్ నిర్వాహకులు మరి కొంత కాలం గడువు కోరగా కోర్టు అనుమతి ఇవ్వలేమని, తక్షణం ఖాళీ చేయాల్సిందేనని స్పష్టం చేసిందన్నారు. కోర్టు ఉత్తర్వుల మేరకు బుధవారం అన్నపూర్ణ షాపింగ్ కాంప్లెక్స్ లోని షాపులను సీజ్ చేస్తున్నామని స్పష్టం చేశారు.

జీఎస్టీ తగ్గింపుతో ఇంటి నిర్మాణాలు సులభం

నెహ్రూనగర్: నిర్మాణ రంగ వస్తువులపై జీఎస్టీ తగ్గింపు ద్వారా సామాన్యులకు ఇంటి నిర్మాణం సులభమయ్యే అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం కల్పించిందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ''బిల్డింగ్ డెవలపర్స్, కన్‌స్ట్రక్షన్ మెటీరియల్స్'' అంశంపై క్రెడాయ్, నరేడ్కో, బీఏఐ సభ్యులు, బిల్డర్లు, డెవలపర్లు, కాంట్రాక్టర్లు, కన్‌స్ట్రక్షన్ మెటీరియల్ సప్లయర్లు (సిమెంట్, పెయింట్స్, ఇంటీరియర్, ఎక్విరియర్), హార్డ్‌వేర్ షాపుల ఎగ్జిబిషన్ స్థానిక ఏసీ కాలేజీ సెమినార్ హాల్‌లో జరిగింది.

ప్రతి కమర్షియల్ సంస్థకు ట్రేడ్ లైసెన్స్ ఉండాలి

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో ప్రతి కమర్షియల్ సంస్థకు డీఅండ్ ఓ ట్రేడ్ లైసెన్స్ ఉండాలని, రోడ్లు, డ్రెయిన్‌లపై ఉన్న ఆక్రమణలకు లైసెన్స్‌లు జారీ చేయవద్దని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. మంగళవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సామవేశ మందిరంలో ప్రజారోగ్య విభాగ అధికారులు, కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

తాగునీటిని ఎప్పటికప్పుడు పరీక్షించాలి

ఇంజినీరింగ్ సిబ్బందికి కమిషనర్ ఆదేశం


తాగునీటిని పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో నగరపాలక సంస్థ సరఫరా చేసే తాగునీటిని ఎప్పటికప్పుడు క్లోరిన్ టెస్ట్ చేయాలని, ఎక్కడైనా పైపులైను లీకులు గుర్తిస్తే తక్షణ మరమ్మతు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కమిషనర్ భారత్ పేట, అరండల్ పేట, అశోక్ నగర్, రెడ్డిపాలెం తదితర ప్రాంతాల్లో పీజీఆర్‌ఎస్, డయల్ యువర్ కమిషనర్‌లో ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను నేరుగా పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో వార్డు సచివాలయాల వారీగా తాగునీరు సరఫరా జరిగే సమయంలో తప్పనిసరిగా శ్యాంపిల్స్ సేకరించాలని ఎమినిటి కార్యదర్శులను ఆదేశించారు. టెయిల్ ఎండ్ ప్రాంతాల్లో క్లోరిన్ టెస్ట్‌లు చేసి, నిర్దేశిత రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. పైపులైన్లు డ్రెయిన్లకు సమాంతరంగా ఉన్నా, లీకులు ఉన్నా వెంటనే షిఫ్ట్ చేయడం, మరమ్మతు చేయాలని ఏఈలను ఆదేశించారు. డయల్ యువర్ కమిషనర్‌లో తాగునీటి సరఫరాపై ఫిర్యాదు చేసిన భారత్ పేట, అరండల్ పేటల్లో ఫిర్యాదుదారి నివాసంలోని తాగునీటిని తాగి పరిశీలించారు.

ఎమ్మెల్యే రామాంజనేయులు వ్యాఖ్యలు సిగ్గుచేటు

నెహ్రూనగర్: తురకపాలెంలో కలుషిత నీరు కారణంగా మరణించిన బాధితుల చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు దళిత సంఘాలను దళారి సంఘాలు అనడం సిగ్గుచేటని మాలమహాసభ వ్యవస్థాపక అధ్యక్షులు మల్లెల వెంకట్రావు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం బాధిత కుటుంబ సభ్యులు, దళిత సంఘాల నాయకులతో కలిసి బ్రాడీపేటలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలుషిత నీరు తాగి 24 మంది మాలలు చనిపోతే ఎమ్మెల్యే రామాంజనేయులు కనీస మానవత్వం లేకుండా వ్యవహరించారని పేర్కొన్నారు. మరణించిన వారు జగన్ మందు సేవించి మరణించారని, ఇతర అనారోగ్య కారణాల వలన మరణించారని ప్రచారాలు చేయడం బాధాకరమన్నారు. తక్షణమే దళిత సంఘాలకు ఎమ్మెల్యే రామాంజనేయులు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో దళిత సంఘాల నాయకులు విద్యాసాగర్, బండ్లమూడి స్టాలిన్, నల్లపు నీలాంబరం, చిన్నం డేవిడ్ విలియమ్స్, కనకవల్లి వినయ్, కొప్పుల సురేష్, గోదా జాన్ పాల్ తదితరులు పాల్గొన్నారు.